క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో రాష్ట్ర గిరిజన అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి, బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

ఆర్థికసాయం

పాలకుర్తి టౌన్: మండలంలోని పెద్దతండా(కె) గ్రామ పంచాయతీకి చెందిన బానోత్ స్వర్ణముర‌ళీ దంపతులు గత ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోగా ఇద్దరు కూతుళ్లతోపాటు, ఒక కుమారుడు అనాథలయ్యారు. అనాథ విద్యార్థులను ఆదుకునేందుకు సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ మండలం కోమటిగూడెం పంచాయతీ కార్యదర్శి లకావత్ సంతోష్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

శాతాపురంలో..

మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన బీరెల్లి అనూష అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, సోమవారం మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. డాక్టర్ చుక్క రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గూడూరు మాజీ సర్పంచ్ పులయ్య మృతురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు.

నేటినుంచి వేసవి శిక్షణ శిబిరం

పాలకుర్తి టౌన్: చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించనున్నట్లు పాఠశాల హెచ్ఎం పోతుగంటి నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్, సాఫ్ట్‌బాల్, కబడ్డీ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా యువజన క్రీడల అధికారి గోపాలరావు ప్రారంభిస్తారని చెప్పారు.

చోరీ

లింగాలఘణపురం: మండల కేంద్రంలో బోయిని రాములు ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.45వేల నగదుతో పాటు మరో రూ.45వేలు విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. రాములు శనివారం ఇంటికి తాళం వేసి వలిగొండలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తాళం పగులగొట్టి బీరువాలోని నగదు, సుమారు ఏడున్నర గ్రాముల బంగారు ఆభరణాలు ఉంగరాలు, కమ్మలు ఎత్తుకెళ్లారు. రాములు ఊరి నుంచి ఆదివారం ఉదయం ఇంటికి రావడంతో తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోనికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఎస్సై ప్రవీణ్‌కు సమాచారం ఇవ్వగా క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

విద్యుత్ స్తంభాలు ధ్వంసం

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని పాత గాంధీ చౌరస్తా సమీపాన ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఇసుక లారీ వెనుక ట్రాలీడబ్బా ఒక్కసారిగా విద్యుత్‌పోల్‌పై పడగా రెండు విద్యుత్‌పోల్‌లు ధ్వంసమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌కు చెందిన గట్టు రాములు అనే వ్యక్తి గృహ నిర్మాణం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి గోదావరి ఇసుకను తెప్పించుకున్నాడు. ఇసుక లోడ్‌తో ఉన్న లారీ ఇసుకను రాములు ఇంటి వద్ద పోసే క్రమంలో లారీ కింది భాగంలో ఉండే హైడ్రాలిక్ రాడ్ విరిగింది. దాంతో లారీ వెనుక ట్రాలీ డబ్బా ఇసుకలోడ్‌తో సహా ఒక్కసారిగా పక్కనే ఉన్న పోల్‌పై పడింది. విద్యుత్‌స్తంభం విరిగి కరెంట్‌వైర్లు తెగడంతో సమీపాన ఉన్న మరో విద్యుత్‌పోల్ విరిగింది. ఇసుక లారీ పడటంతో విద్యుత్‌పోల్ విరగడంతో ఒక్కసారిగా కరెంటు సరఫరా నిలిచిపోయింది.

పిడుగుపడి ఎద్దు మృతి

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడెంలో ఆదివారం రాత్రి భారీ వర్షంతో పిడుగు పడడంతో బండ మల్లయ్యకు చెందిన ఎద్దు మృతి చెందిన ట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.50వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు తీవ్ర మనోవేదన చెందాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

వర్షానికి కూలిన ఇల్లు

పాలకుర్తి టౌన్: మండలంలోని విస్నూరులో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నువులిపురి లక్ష్మయ్య ఇల్లు పై కప్పుకూలింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని లక్ష్మయ్య కోరారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని క్లాంకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ జిల్లెల రాంరెడ్డికి సోమవారం రాత్రి మంథోనిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. రాంరెడ్డి రోజు వారిగా విధులు నిర్వహించుకొని తన సోదరుడు ఎల్లారెడ్డితో కలిసి బైక్‌పై జనగామ నుంచి క్లాం వెళ్తున్నారు. వీరి వెనుకాలే వస్తున్న చాపల సాయి, మద్రికుక్కల కరుణాకర్ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొనడంతో కుడికాలు విరిగింది. స్థానికులు ప్రాథమిక చికిత్స చేయించి జనగామకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బచ్చన్నపేట: జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



జనగామ రూరల్: శ్రీసాయి సెంట్రింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నర్మెటలో..



రఘునాథపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఘనంగా మే డే

ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూడళ్లలో అరుణ పతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. జిల్లా కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో భారీ ర్యాలీ తీసి వైష్ణవి గార్డెన్‌లో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఎస్ఆర్‌కేఎస్, ప్రజాసంఘాల నాయకులు, తాపీమేస్త్రీలు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ రూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి మధు



పాలకుర్తి టౌన్: మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు



తరిగొప్పులలో..



జఫర్‌గఢ్‌లో..



లింగాలఘణపురం: జెండా ఎగుర వేస్తున్న హమాలీలు



చిల్పూరులో..



దేవరుప్పుల: కడవెండిలో సీపీఎం నాయకులు..



కొడకండ్లలో.. హమాలీ సంఘం నాయకులు

హనుమాన్ నగర సంకీర్తన

కొడకండ్ల: మండలంలోని రామవరంలో గిరగాని చంద్రమౌళి–శశిరేఖ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్ పటం పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కొడకండ్ల, పాలకుర్తి, తిర్మలగిరి మండలాలకు చెందిన హనుమాన్ మాల ధారణ స్వాములు పెద్ద సంఖ్యలో హాజరు కాగా అర్చన, అభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో 108 మంది నగర సంకీర్తన చేసిన అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాదయాత్ర..

బచ్చన్నపేట: మండల కేంద్రం నుంచి పలువురు హనుమాన్ మాలాధారులు పలు ఆలయాలకు వెళ్లడానికి పాదయాత్రను చేపట్టారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ విగ్రహం వద్ద పూజలు చేసి కొడవటూర్‌లోని శ్రీ సిద్దేశ్వరాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి ఆలయాలు తిరుగుతూ పాదయాత్రగా కొండగట్టుకు చేరుకొని అక్కడ మాల విమరణ చేస్తామని తెలిపారు. స్వాములు చందు, కరుణాకర్, గుంటిపెల్లి పరమేశ్వర్, పొదిల శ్రీనివాస్, అనిల్, రవీందర్‌రెడ్డి, దేవరకొండ క్రాంతి, భరత్, సాయి , భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలతోనే సంఘం ఏకమవడానికి దోహదం

చిల్పూరు: సభ్యత్వాలతోనే సంఘాన్ని ఏకం చేయడానికి దోహదపడుతుందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో సోమవారం సంఘం మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంఘంలో శాశ్వత సభ్యత్వ రుసుము రూ. వేయి, సాధారణ సభ్యత్వంగా రూ. 100 గా నిర్ణయించినట్లు తెలిపారు. మొదటి శాశ్వత సభ్యత్వాన్ని మండల అధ్యక్షుడు గజ్జెల దామోధర్ జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆంజనేయులు, నాగరాజు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో గత నెల 30 నుంచి ఈనెల 5వరకు నిర్వహిస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి పాల్గొని పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులందరూ ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని, ఇలాంటి ఉత్సవాలతో ఆధ్యాత్మిక సంతరించుకుంటుందన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేయగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ఇబ్బందులు

కొడకండ్ల: కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ప్రభుత్వం ఆలస్యం చేయడంతోనే నేడు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ ఆరోపించారు. సోమవారం నర్సింగాపురం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సోమనర్సయ్య, రవీందర్, రంగయ్య, అంజయ్య, రాహుల్, శ్రీనివాస్, ఖలీం, రమేష్, యాకేష్, వెంకన్న, రవీందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ నాయకుడు నరేష్‌బాబు



బచ్చన్నపేట: సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రఘునాథపల్లి/నర్మెట/జఫర్‌గఢ్/చిల్పూరు/దేవరుప్పుల/కొడకండ్ల/బచ్చన్నపేట/పాలకుర్తి/తరిగొప్పుల : జిల్లా వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ వారు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె సోమవారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు పలు పార్టీల నాయకులు, సర్పంచ్‌లు గ్రామ పంచాయతీలకు తాళం వేసి సంఘీభావం తెలిపారు. సమ్మెలో జేపీఎస్‌లు మోకాళ్లపై నిల్చొని, కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. చిల్పూరు మండలంలోని బద్రెంకల చెరువు కట్టపై ఉన్న సీఎం కేసీఆర్ విగ్రహానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.



చిల్పూరు: కేసీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

గ్రామ దేవతల ఉత్సవాలకు ఆహ్వానం



రఘునాథపల్లి: మండల కేంద్రంలో మంగళవారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే గ్రామ దేవతల ఉత్సవాలకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సర్పంచ్ పోకల శివకుమార్, జెడ్పీటీసీ బొల్లం అజయ్, నిర్వహణ కమిటీతో కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాష్, జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డిలను వెర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మండల యూత్ అధ్యక్షుడు దుబ్బాక హరీష్, కార్యదర్శి ముసిపట్ల అశోక్ పాల్గొన్నారు.

తండాలకు మహర్దశ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవర్ధన్

నర్మెట: సీఎం కేసీఆర్ పాలనలో పంచాయతీలుగా ఏర్పడిన తండాలకు మహర్దశ కలిగిందని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అన్నారు. మండలంలోని హన్మంతాపూర్ తెట్టికుంట తండాకు బీటీ రోడ్డు పనులను సర్పంచ్ పగడాల విజయ నర్సయ్యతో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మారు మూల ప్రాంతాలైన తండాలలో కనీస వసతులు లేక పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని పంచాయతీలుగా మారడంతో మౌలిక వసతులు కల్పనకు వీలుపడిందని అన్నారు. నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, జిల్లా ,మండల నాయకులు న్యాయవాది రెడ్డబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకం

జనగామ: జనగామ పట్టణంలోని రైల్వేస్టేషన్ వైశ్య భవన్‌లో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర, శ్రీ సీతా రామచంద్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో భాగంగా.. సోమవారం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఐదో రోజు 101 గోత్రములతో ప్రత్యేక అభిషేకములు, సువాసిని పూజలు, ధన్యాధివా సము, చాయాధివాసము, అధివాస హోమములను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, కార్యదర్శి బుద్ధ రమేష్, కోశాధికారి రామిని రాజేశ్వర్, జైన రమేష్ , కౌన్సిలర్ మహంకాళి హరిచందర్ గుప్త, బిజ్జాల నవీన్‌గుప్తా, తడక మళ్ల నరసింహరావు, పుల్లూరి శ్రీనివాస్, పజ్జూరి జయాహరి, లక్ష్మి నరసయ్య, కోకల మల్లేశం, సరాబు వీరన్న, తోడుపునూరి ప్రసాద్, గందె వేణు, యాంసాని శ్రీనివాస్, కాచం సురేష్, మంచన హరీష్, వైష్యా రత్నాల సభ్యులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న అర్చకులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి



చిల్పూరు: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్



కొడకండ్ల: ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేవీఆర్

చిల్పూరు: వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విమల అన్నారు. ఆదివారం రాత్రి భారీ వర్షం కురియడంతో సోమవారం తహసీల్దార్ విమల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణాజీగూడెంలో ఎంపీటీసీ సాదం నర్సింహులు, రైతు జక్కుల రాజయ్య మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా ధాన్యాన్ని బస్తాల్లో నింపి తూకం వేశారని వాటిని తరలించే చర్యలు మాత్రం చేపట్టడం లేదని అన్నారు. దీంతో రెండు రోజుల్లో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కుంచాల సంపత్‌రాజు తదితరులు ఉన్నారు.

రైతులు ఆధైర్యపడొద్దు

కొడకండ్ల: అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతే రైతులు ఆధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉండి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయని, రైతులు మాత్రం ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అండగా ఉంటూ ఆదుకొంటామని అన్నారు. సర్పంచ్ మధుసూదన్, కోఆప్షన్ నసీరుద్దీన్, మార్కెట్ కార్యదర్శి నిరంజన్, సొసైటీ ఎండీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

దేవరుప్పుల: ఐదేళ్లకోసారి ఊరూరా తిరిగి తమ కులవృత్తి కళల ద్వారా పొట్టపోసుకునే పగటివేషగాళ్ల ప్రదర్శనలు అలరించాయి. తొర్రూరు పట్టణానికి చెందిన మేటి పగటివేషగాడు శిరువాటి గంగాధర్ వారసత్వంగా ఆయన కుమారుడు యాదగిరి నేతృత్వంలో కాళీమాత(సంజీవ), పోతరాజు(సింహాద్రి), మైసాసురుడి(మహేందర్) వేషంతో సోమవారం మండల కేంద్రంలో రక్తికట్టించారు.



దేవరుప్పులలో పగటివేషగాళ్లు

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

దేవరుప్పుల: బీఆర్ఎస్ పార్టీ హంగులు, ఆర్భాటాలకు స్వస్తిపలికి అకాల వర్షంతో అతలాకుతలమవుతున్న అన్నదాతలను వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీతారాంపురం గ్రామంలో నీటమునిగి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. నాయకులు సొడ రమేష్, బాగాల నవీన్‌రెడ్డి,చింత సృజన్, రాజోజు నరసింహ చారి తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

పాలకుర్తి: దర్దేపల్లి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పలువురు పాల్గొన్నారు.



పాలకుర్తి: ధర్నా చేస్తున్న నాయకులు

ముంచిన వాన

అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరి నీట మునిగిపోగా.. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం ఆరబోసేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.



జనగామ: పీఏసీఎస్ సెంటర్‌లో ధాన్యం ఆరబోస్తున్న రైతులు



జనగామ: చీటకోడూరులో ధాన్యం ఆరబోస్తున్న రైతులు



స్టేషన్‌ఘన్‌పూర్: విశ్వనాథపురం సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు



స్టేషన్‌ఘన్‌పూర్: సెంటర్‌లో కుటుంబ సభ్యులకు సహాయపడుతున్న చిన్నారులు



జనగామ పీఏసీఎస్‌లో తడిసిన ధాన్యం ఆరబెట్టుకుంటున్న మహిళా రైతు



పాలకుర్తి: విస్నూరు సెంటర్‌లో నీటిమునగిన ధాన్యం